సాక్షి రంగారెడ్డి

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



మహిళలకు ఆరోగ్య రక్ష

ప్రధాని మోదీ మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 8లో▸



సాయుధ పోరు వారసులు..

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులేనని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ పేర్కొన్నారు. 8లో▸



హామీల అమలులో..

ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని గువ్వల బాలరాజు ఆరోపించారు. 8లో▸

న్యూస్‌రీల్

ఔషధ మొక్కలతో ఆరోగ్యానికి మేలు

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మొక్కలు నాటుతున్న మంత్రి శ్రీధర్ బాబు తదితరులు

మొయినాబాద్ రూరల్: ఔషధ మొక్కలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తోల్‌కట్ట చౌరస్తాలో ఉన్న పీవీ నర్సింహారావు కేంద్రంలో స్వామి రామానంద తీర్థ వనమూలికల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఔషధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఔషధ మొక్కలు మానవ మనుగడకు ముఖ్యమన్నారు. కాలుష్యం పెరగుతున్న తరుణంలో ఔషధ మొక్కలను పెంచి స్వచ్ఛమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ఆధ్వర్యంలో చేపడుతున్న మొక్కల పెంపకం ప్రతీ ఒక్కరికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు చెల్లించండి



ఎంపీడీఓ, ఎంపీఓలకు వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు

కడ్తాల్: ఎస్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల పెండింగ్ వేతానాలు చెల్లించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కాలె వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సంఘం నాయకులతో కలిసి ఎంపీడీఓ సుజాత, ఏపీఓ లలితకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీను, సత్తయ్య, లక్ష్మణ్, శ్రీను, రమేశ్, శ్రీనివాస్, సువర్ణ, యాదగిరి, బీబీ బేగం తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ట్రాఫిక్ సమ్మిట్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసులు తొలిసారిగా ట్రాఫిక్ సమస్యలు, పరిష్కారాలపై కీలక సదస్సు నిర్వహించనున్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ నేతృత్వంలో ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్–2025 పేరుతో రెండు రోజుల పాటు దీనిని తలపెట్టారు. నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్‌లో గురువారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సదస్సును ప్రారంభించనున్నారు. ఇందులో వివిధ వాణిజ్య సంస్థలు, నిపుణులు, స్టార్టప్స్, స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. సురక్షిత నగరాలు, స్థిరమైన రవాణా, సమగ్రమైన ప్రయాణ వ్యవస్థలు, రోడ్డు భద్రతకు సంబంధించిన డిజైన్లు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, భవిష్యత్తులో సవాళ్లు, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై కూలంకషంగా రెండు రోజుల పాటు చర్చించనున్నారు. సదస్సు తీర్మానాలను విధానపరమైన నిర్ణయాల కోసం ప్రభుత్వానికీ సిఫార్సు చేయాలని అధికారులు నిర్ణయించారు. రహదారి భద్రత, ఎలక్ట్రానిక్ వాహనాలు తదితర రంగాల్లో సేవలు అందిస్తున్న స్టార్టప్స్, సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు ఈ సమ్మిట్‌లో అవకాశం కల్పిస్తున్నారు. నగరంలోని ట్రాఫిక్ సమస్యలు, విభాగాల మధ్య సమన్వయ లోపం, నగరవాసుల్లో అవగాహన లేమి, పాలకుల నిర్లక్ష్యాలకు ఈ సమ్మిట్ ద్వారా పరిష్కార మార్గాలు చూపాలని సెక్యూరిటీ కౌన్సిల్ భావిస్తోంది.

రేపు పశువైద్య వర్సిటీ స్నాతకోత్సవం

ఏజీవర్సిటీ: ఈ నెల 19న పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు వీసీ ఎం.జ్ఞాన ప్రకాశ్ తెలిపారు. బుధవారం పశువైద్య విశ్వవిద్యాలయంలో వీసీ భవనంలో ఆయన మాట్లాడుతూ.. స్నాతకోత్సవం 2023 నుంచి 2024 వరకు పట్టభద్రులైన మొత్తం 524 మందికి పట్టాలు ప్రదాన చేస్తామన్నారు. 25 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాల యం ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ శరత్‌చంద్ర, ఫ్యాకల్టీస్ డీన్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

'మణి'కొండ చుట్టే అనకొండలు!

విద్యుత్, మున్సిపల్, ఇరిగేషన్, సీటీ విభాగాల్లో అక్రమార్కుల పాగా

- ఏసీబీ వలకు వరుసగా చిక్కుతున్న అవినీతి తిమింగళాలు
- నార్సింగి టీపీఓ అంశాన్ని మరువక ముందే మరొకరు
- ఏడీఈ అంబేడ్కర్ సన్నిహితుడు చేవెళ్ల ఏడీఈ ఇంట్లో తాజాగా సోదాలు
- రూ.17 లక్షల నగదు, పలు స్థిరాస్తి పత్రాలు గుర్తించినట్లు సమాచారం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలోని 'మణి'కొండ చుట్టే అనకొండలు పాగా వేశాయి. ఇవి ఒక్కొక్కటిగా ఏసీబీ వలకు చిక్కుతున్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్ కోసం రూ.4 లక్షలు తీసుకుంటూ నార్సింగి మున్సిపల్ కార్పొరేషన్ టీపీఓ మణిహారిక ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఘటన మరువక ముందే మంగళవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇబ్రహీంబాగ్ ఆపరేషన్స్ ఏడీఈ అంబేడ్కర్‌ను ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో ఏసీబీ అరెస్ట్ చేసింది. తాజాగా బుధవారం ఆయన సన్నిహితుడు, బినామీ చేవెళ్ల ఏడీఈ రాజేశ్ ఇంట్లోనూ సోదాలు నిర్వహించగా బాత్‌రూంలో రూ.17 లక్షల నగదు సహా పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈయన ఇదే డివిజన్‌లోని చిలుకూరు సెక్షన్ ఏఈగా పని చేశారు. ఇటీవలే పదోన్నతిపై చేవెళ్లకు వెళ్లడం గమనార్హం.

తప్పించినా.. తప్పుకోకుండా..

ఏడీఈ అంబేడ్కర్ 1998 ఏపీఎస్‌ఈబీ ద్వారా ఖమ్మంలో తొలి పోస్టింగ్. ఆ తర్వాత డిప్యూటేషన్‌పై జీహెచ్‌ఎంసీకి ఏఈగా వచ్చారు. ఏడీఈగా పదోన్నతి పొందిన తర్వాత డిస్కంలోకి అడుగుపెట్టారు. పటాన్‌చెరు, కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో కీలక పోస్టుల్లో పనిచేశారు. ఆయన సర్వీసు అంతా ఫోకల్ పోస్టుల్లోనే కొనసాగారు. కాగా ఇబ్రహీంబాగ్, మణికొండ, గచ్చిబౌలి డివిజన్లపై గత ఏడాది డిస్కం ఉన్నతాధికారులకు భారీగా ఫిర్యాదులు అందాయి. ఈ అంశాన్ని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సీరియస్‌గా తీసుకుని అప్పట్లో గచ్చిబౌలి డీఈని బదిలీ చేశారు. ఇబ్రహీంబాగ్ డీఈకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇదే సమయంలో ఏడీఈ అంబేడ్కర్‌ను సైతం మరో చోటికి బదిలీ చేశారు. అయినా కదలకుండా ప్రభుత్వంలోని పెద్దలకు భారీగా ముడుపులు ముట్టజెప్పి అదే పోస్టులో కొనసాగుతూ వచ్చారు. సాధారణంగా మూడేళ్లు ఫోకల్ పోస్టులో పని చేస్తే.. ఆ తర్వాత ఉంచరు. కానీ ఏడీఈ అంబేడ్కర్ విషయంలో నిబంధనలు అమలు కాలేదు. ప్రభుత్వంలోని పెద్దలే ఆయనకు అండగా నిలవడంతో ఉన్నతాధికారులు సైతం చేతులెత్తేశారు. ఏడీఈగా ప్రభుత్వ సంస్థ నుంచి ప్రతి నెలా రూ.లక్షల్లో వేతనాలు పొందుతూ.. తన బినామీలతో యూజీ కేబుల్ వర్క్‌లు చేయించి, పెద్ద మొత్తంలో ఆస్తులను కూడబెట్టినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన ఇంటితో పాటు బంధువులు, సన్నిహితుల నివాసాలు, ఆఫీసుల్లోనూ ఏసీబీ సోదాలు చేపట్టింది.

17 మంది ఇంజనీర్లపై ముఖ్యమంత్రి ఆరా?

ఇబ్రహీంబాగ్ డివిజన్ చిలుకూరు సెక్షన్ ఏఈగా పని చేసి, ఇటీవలే పదోన్నతిపై చేవెళ్ల వెళ్లిన ఏడీఈ రాజేశ్.. ఇప్పటికే ఏసీబీ కేసులో అరెస్టైన అంబేడ్కర్‌కు బినామీగా వ్యవహరించినట్లు సమాచారం. ఇద్దరు కలిసే పలు కాంట్రాక్టులు చేసినట్లు తెలుస్తోంది. మారేడుపల్లిలో నివాసం ఉంటున్న చేవెళ్ల ఏడీఈ రాజేశ్ ఇంట్లో బుధవారం ఏసీబీ సోదాలు నిర్వహించగా బాత్‌రూమ్‌లో రూ.17 లక్షల నగదు సహా కీలక స్థిరాస్తి డాక్యుమెంట్లు లభించినట్లు సమాచారం. కాగా ఏసీబీ అధికారులు మాత్రం ఈ అంశాన్ని ఇంకా ధ్రువీకరించలేదు. ఇదిలా ఉంటే ఇప్పటి వరకు ఫోకల్ టు ఫోకల్ పోస్టులు దక్కించుకున్న 17 మంది ఇంజనీర్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఏళ్లుగా శివారు ప్రాంతాల్లోనే విధులు నిర్వహిస్తూ భారీగా ఆస్తులు కూడబెట్టిన ఇంజనీర్లలో ఏడీఈ, డీఈలే కాకుండా పలువురు సీఈ, ఎస్‌ఈ స్థాయి అధికారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఏసీబీ సోదాలతో ఆయా అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఎప్పుడు? ఎక్కడ? సోదాలు చేస్తారో? అనే ఆందోళన ఆయా ఇంజనీర్లలో వ్యక్తమవుతోంది.

ఉద్యోగులకు కాసుల వర్షం

శివారు మున్సిపాలిటీలు, పోలీసుస్టేషన్లు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, విద్యుత్, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసుల్లో పోస్టుల కోసం ఉద్యోగుల మధ్య తీవ్రమైన పోటీ ఉంటుంది. ఐటీ అనుబంధ సంస్థలు, హైరైజ్ భవనాలు, హోటళ్లు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఎక్కువగా ఉన్న హైటెక్‌సిటీ, మణికొండ, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, బండ్లగూడజాగీర్, నార్సింగి, కోకాపేట్, గండిపేట్, రాజేంద్రనగర్, శంషాబాద్ మొయినాబాద్ సహా శివారు ప్రాంతాలు ఆయా విభాగాల ఉద్యోగులకు కాసుల వర్షం కురిపిస్తుంటాయి. వివిధ విభాగాల్లోని, వివిధ సెక్షన్లలో ఫోకల్ పోస్టింగ్‌ల కోసం భారీగా వెచ్చిస్తుంటారు. వీటిని తిరిగి సంపాదించుకునేందుకు అడ్డదారులు తొక్కుతూ ఏసీబీకి చిక్కుతున్నారు.

ఏసీబీ చిక్కిన తిమింగళాలు

- రాజేంద్రనగర్ మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ జూలై 24న ఓ హోటల్ యజమాని నుంచి రూ.2 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- మణికొండ మున్సిపల్ పరిధిలోని జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి నల్లా కనెక్షన్‌కు రూ.30 వేలు తీసుకుంటూ పట్టుబడింది. – మణికొండ మున్సిపల్ ఇంజనీరింగ్ డీఈ దివ్యజ్యోతి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు స్వయంగా ఆమె భర్త వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో ఉన్నతాధికారులు ఆమెను తప్పించారు. ఏసీబీ కేసు నమోదైనప్పటికీ నేటికీ అరెస్ట్ చేయలేదు.
- నెక్నాంపూర్‌లోని ఓ నిర్మాణానికి నిరభ్యంతర పత్రం జారీ కోసం రూ.2.50 లక్షలు డిమాండ్ చేసిన ఇరిగేషన్ ఏఈ నిఖేష్, గండిపేట సర్వేయర్ గణేశ్ ఎన్‌ఓసీ జారీ కోసం భారీగా డబ్బులు డిమాండ్ చేసి పట్టుబడ్డారు.
- ఏఈ నిఖేష్ రూ.500 కోట్లకు పైగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించి, కొంత మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.
- నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బన్సీలాల్, అసిస్టెంట్ ఇంజనీర్ కార్తీక్ ఏసీబీ కేసులో అరెస్ట్ అయ్యారు.
- గోపన్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న ఓ భవనానికి విద్యుత్ మీటర్ మంజూరుకు రూ.50వేలు డిమాండ్ చేసి గచ్చిబౌలి డివిజన్ ఏడీఈ సతీశ్ ఏసీబీకి చిక్కారు. ఆయన వంద కోట్లకు పైగా ఆస్తులను కూడబెట్టినట్లు గుర్తించారు.
- మాదాపూర్ డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్ ఎం.సుధ జూలై 9న ఓ చిన్న కంపెనీకి జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం రూ.8 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ పట్టుబడింది.

దేశంలోనే సంపన్న జిల్లా



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- రూ.11.46 లక్షల తలసరి ఆదాయంతో అగ్రస్థానం
- అమరుల త్యాగఫలమే రాష్ట్ర ఆవిర్భావం
- ప్రజాపాలన దినోత్సవంలో నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి



కలెక్టరేట్‌లో జెండాకు వందనం చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవానికి హాజరైన ఆయన పోలీసుల గౌరవ వందన స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సర్వే ప్రకారం రంగారెడ్డి జిల్లా దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందంటే అది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. జీడీపీ రూ.11.46 లక్షలతో జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. అమరుల త్యాగ ఫలితమే నాటి హైదరాబాద్ రాష్ట్రం నుంచి నేటి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావమని చెప్పారు. రాష్ట్రంలో వారసత్వంగా వచ్చిన సంపదను పరిరక్షించుకోవడంతో పాటు ప్రజా ఆకాంక్షలను నెరవేర్చడమే తమ కర్తవ్యమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం వాగ్దానాలన్నింటినీ అమలులోకి తెచ్చిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేశామన్నారు. 51,874 కొత్త తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేశామని వివరించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి పేదలకు మేలు చేకూర్చామని చెప్పారు. కోటి 26 లక్షల మంది రైతులకు నాలుగు విడతలలో రూ.769.53 కోట్ల రుణమాఫీ జరిగిందని గుర్తు చేశారు. ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్ మహానగరానికి ప్రత్యేక గుర్తింపు లభించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు 30వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రం గేమ్ చేంజర్ అవుతుందన్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ కలిపి ప్రపంచంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గల నగరంగా రూపొందించాలనేది ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇందులో ఏఐసిటీ, ఫార్మాసిటీ, లైఫ్‌సైన్సెస్ హబ్‌లు, సూపర్ సిటీలు అంతర్భాగంగా ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీ మీదుగా 41.5 కిలోమీటర్ల దూరం రేడియల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని.. 300 అడుగుల వెడల్పుతో రూ.4వేల కోట్లతో ఈ నిర్మాణం పూర్తవుతుందని వివరించారు. రెండు దశల్లో మూసీ నది పునరుజ్జీవం చేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, బోటింగ్‌లతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి మూసీ సుందరీకరణ తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, డీసీపీ సునీతారెడ్డి, గడ్డి అన్నారం ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

పల్లెలు మెరవాలి

స్వచ్ఛతా హీసేవ-2025లో ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంత్యుత్సవాలు

ఇబ్రహీంపట్నం రూరల్: స్వచ్ఛతతో పల్లెలు మెరవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా స్వచ్ఛతా హీసేవ–2025 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 17– అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో నిర్వహించాలన్నారు. ఇందులో ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి అని చెప్పారు. 15 రోజుల పాటు చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయడం, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు కిట్‌లు అందజేసి సఫాయి మిత్ర సురక్షా శిబిర్ కార్యక్రమం, శ్రమదాన కార్యక్రమాలు చెత్త నుంచి కళాకృతులు తయారు చేయడం, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు, పాఠశాలలు, గ్రామాల్లో స్వచ్ఛతా ర్యాలీలు, మహిళా సంఘాలు, విద్యార్థులతో ప్రతిజ్ఞలు చేయించాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఆహార పదార్థాల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. తృణ ధాన్యాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. శరీరానికి పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, మాంసాహారంతో పోలిస్తే చిరు ధాన్యాల్లో ప్రొటీన్స్ ఎక్కువగా ఉంటాయని చెప్పారు. చిరు ధాన్యాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలతో చేయూత

విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలను కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన కలెక్టర్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వస్తువుకు ఒక ఆకృతిని ఇచ్చే వారే విశ్వకర్మలన్నారు. శిల్పులకు ఆదరణ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలు వారి వృత్తులకు చేయూతనిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, డీఆర్‌ఓ సంగీత, డీసీపీ సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి కేశురాం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష, సీపీఓ సౌమ్య, డీఆర్‌డీఓ శ్రీలత, సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేశ్ మోహన్, అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు .

అమరుల స్థూపం.. త్యాగానికి ప్రతిరూపం

ప్రొఫెసర్ కోదండరాం

షాద్‌నగర్: అమరవీరుల స్థూపం వారి త్యాగాలకు ప్రతిరూపంగా నిలుస్తుందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉద్యమ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ అమర వీరుల స్థూపం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేశారని గుర్తు చేశారు. తొలి, మలి దశ ఉద్యమంలో ఎందరో ప్రాణాలు కోల్పోయారన్నారు. అమరుల త్యాగాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని చెప్పారు. ఉద్యమంలో అసువులు బాసిన అమరుల త్యాగాలకు చిహ్నంగా స్మారక స్థూపం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధనకు అమరులు చేసిన త్యాగం వెలకట్టలేనిదని అన్నారు. జనవరి 26 నాటికి స్థూపం ఏర్పాటుచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘు నాయక్, చెంది తిరుపతిరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, కరుణాకర్, జనార్దన్, టీజీ శ్రీనివాస్, ఇబ్రహీం, అన్వర్, దర్శన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్ర గొప్పది

షాద్‌నగర్‌రూరల్: ప్రపంచ ఉద్యమ చరిత్రలో తెలంగాణ ఉద్యమం గొప్పదని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవానికి ప్రొఫెసర్ కోదండరాం హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వాన్ని తెచ్చుకున్నామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థూపం ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న కోదండరాం, వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌రూరల్: క్యాంపు కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చొద్దు

- సాగర్ హైవే దిగ్బంధానికి రైతుల యత్నం
- మద్దతు తెలిపిన అఖిలపక్షం నాయకులు

మాడ్గుల/యాచారం: రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని అఖిలపక్షం నాయకులు, బాధిత రైతుల ఆధ్వర్యంలో మాడ్గుల మండలం అన్నెబోయినపల్లి గేటు వద్ద బుధవారం హైవే దిగ్బంధం చేపట్టారు. తమ భూములు లాక్కోవద్దని ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాధితులు నినాదాలు చేశారు. అనంతరం సాగర్ హైవేపై బైఠాయించడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఆధ్వర్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి అడ్డుకున్నారు. ఆందోళనకారులను యాచారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసనలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తదితరులున్నారు.



మాడ్గుల: సాగర్ హైవేపై బైఠాయించిన జైపాల్‌యాదవ్, రైతులు, నాయకులు

మార్పులు ఉండొద్దు

యాచారం పోలీస్‌స్టేషన్ వద్ద జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో పేద రైతులకు అన్యాయం చేస్తూ, సీఎం రేవంత్ రెడ్డి బంధువులకు మేలు చేసేలా చేస్తున్నారని ఆరోపించారు. సీఎం బంధువుల వ్యవసాయ భూములను కాపాడుకోవడం కోసమే తరచూ అలైన్‌మెంట్లు మార్చుతూ రైతుల్లో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. గతంలో బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలోనే రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం పట్ల అలైన్‌మెంట్ తయారు చేసి, రైతుల మద్దతు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం ఎలాంటి మార్పులు లేకుండా రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రాంచంద్రయ్య, బీఆర్‌ఎస్ యాచారం మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నాయకులు యాదయ్యగౌడ్, సత్యపాల్, జైపాల్‌రెడ్డి, లక్ష్మినరసింహ, కృష్ణారెడ్డి, తిరుమల్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి మూల్యం తప్పదు
- అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు


ఆమనగల్లులో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

ఆమనగల్లు: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని తెలిపారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఆయన బుధవారం తొలిసారి అచ్చంపేటకు వెళ్తున్న క్రమంలో బీజేపీ ఆమనగల్లు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. అన్ని విషయాల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్, రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కేకేశ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, బీజేపీ నాయకులు దుర్గయ్య, సుండూరు శేఖర్, లక్ష్మణ్, చెన్నకేశవులు, రవిరాథోడ్ పాల్గొన్నారు.

పాత నేరస్తుడి అరెస్ట్


అబ్దుల్ నజీర్

పహాడీషరీఫ్: చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ హఫీజ్‌పేట్ ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్ నజీర్(26) కొత్తపేట్‌లోని షాపింగ్ మాల్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన షాహీన్‌నగర్‌లో ఇంటి ముందు పార్కు చేసిన బైక్, 10వ తేదీన బిస్మిల్లా కాలనీలో ఓ ఇంటి తాళం పగులకొట్టి చోరీలకు పాల్పడ్డాడు. అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు గతంలో హయత్‌నగర్, మియాపూర్, చందానగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. అతని వద్ద నుంచి బైక్, రెండు తులాల బంగారు, 16 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

స్లాబ్ మీద పడి వ్యక్తి మృతి

చాదర్‌ఘాట్: భవనం కూల్చివేత పనుల చేపడుతుండగా ప్రమాదవశాత్తు స్లాబ్ మీద పడి ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మలక్‌పేట దయానంద్ నగర్‌లో ఓ భవనం కూల్చివేత పనులు చేపడుతున్న కార్మికుడు రవికిరణ్‌పై బాత్రూం స్లాబ్ పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తోటి కార్మికులు వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. మృతి చెందాడు.

ట్రిపుల్‌ఆర్‌పై గందరగోళం వద్దు

- రైతులను తప్పుదారి పట్టించొద్దు
- పాత అలైన్‌మెంట్ ఓ కన్సల్టెన్సీ ఊహాజనితమే
- భూ భారతితోనే భూములకు పూర్తి రక్షణ
- 'సాక్షి'తో కలెక్టర్ నారాయణరెడ్డి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తోంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త నగరాలు, రహదారులు, మౌలిక సదుపాయాలకు రూపకల్పన జరుగుతుంది. అందులో రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) కూడా ఒకటి. ప్రభుత్వం తమ ప్రతిపాదనను కేంద్రం ముందు పెట్టింది. ఇంకా ఫైనల్ కాలేదు. ఇప్పటికీ చర్చల దశలోనే ఉన్న ఈ రోడ్డుపై కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జిల్లా ప్రజలను, రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారు. ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ విడుదల చేసిన అనధికారిక అలైన్‌మెంట్(పాత)ను మార్చి, కొత్త అలైన్‌మెంట్ రూపొందిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. నిజానికి పాత అలైన్‌మెంట్ అనేది ఒక ఊహాజనితం మాత్రమే. భూసేకరణ విషయంలో రైతులను తప్పు దోవ పట్టించొద్దు' అని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, వాటి పరిణామాలను ఆయన మాటల్లోనే...

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మాత్రమే ఫైనల్

రావిర్యాల ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు అటు నుంచి ఆమనగల్లు వరకు ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశాం. తొలి విడతలో రావిర్యాల ఎగ్జిట్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఉన్న 20 కిలోమీటర్ల రోడ్డుకు 449 ఎకరాలు, రెండో విడతలో మీర్‌ఖాన్‌పేట వరకు అటు నుంచి ఆమనగల్లు వరకు 21.5 కిలోమీటర్ల రోడ్డుకు 554.35 ఎకరాలు భూమి అవసరమైంది. ఆ మేరకు మొత్తం 4,725 మంది రైతుల నుంచి 1004.22 ఎకరాలు సమీకరించాం. భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి అవార్డును పాస్ చేశాం. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన కొంత మంది రైతులకు సంబంధించిన మొత్తాన్ని అథారిటీలో జమ చేశాం. ఇక్కడ ప్రస్తుతం ఎలాంటి సమస్య లేదు. టెండర్లు కూడా ఖరారయ్యాయి.

ఓ కొలిక్కి వచ్చిన బీజాపూర్ రహదారి

బీజాపూర్ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో ప్రభుత్వం అప్పా టు మన్నెగూడ వరకు(46.405 కిలోమీటర్లు) రోడ్డును రెండు వైపులా 60 మీటర్ల వరకు విస్తరించాలని నిర్ణయించింది. ఆ మేరకు రూ.928.41 కోట్లు ఖర్చు సహా 266.55 హెక్టార్ల భూమి అవసరం ఉన్నట్లు గుర్తించింది. ఇప్పటికే భూసేకరణ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అయితే రోడ్డుకు ఇరు వైపులా ఉన్న 60 నుంచి 80 ఏళ్ల వయసున్న 915 మర్రి వృక్షాలను తొలగించాల్సి రావడంపై కొంత మంది పర్యావరణ వేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పురాతన మర్రి చెట్ల ఉనికి దెబ్బతినకుండా మధ్యేమార్గంగా ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే రెడ్ మార్క్ వేసిన 150 వృక్షాలు మినహా మిగిలిన వాటిని సర్వీసు రోడ్డుకు, ప్రధాన క్యారేజ్‌వేకు మధ్యలో ఉండేలా స్వల్ప మార్పులు చేపట్టారు. ఇప్పటికే మొయినాబాద్, చేవెళ్ల బైపాస్‌రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి.

నాలుగు వేల అర్జీలు క్లియర్ చేశాం

రెవెన్యూ సదస్సుల్లో భాగంగా 21 వేలకుపైగా అర్జీలు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, బాధితులకు నోటీసులు జారీ చేశాం. క్షేత్రస్థాయి నుంచి రిపోర్టులు తెప్పించుకుని ఇప్పటికప్పుడు వాటిని క్లియర్ చేసేందుకు యత్నిస్తున్నాం. రోజుకు సగటున 50 నుంచి 60 దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం. ఇప్పటి వరకు నాలుగు వేలకుపైగా దరఖాస్తులను క్లియర్ చేశాం. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పిదాలకు 'భూభారతి'లో అవకాశం ఇవ్వడం లేదు. భూ భారతి పోర్టల్‌తో అన్ని సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుంది.

ఇంకా ప్రతిపాదనల దశలోనే

నగరంపై ఒత్తిడి తగ్గించేందుకు ఔటర్ మాదిరిగా మరో రింగు రోడ్డు అవసరం ఉందని ప్రజలతో పాటు ప్రభుత్వం భావిస్తోంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తైతే జిల్లా రూపు రేఖలే మారబోతున్నాయి. భూముల ధరలు పెరిగి, రియల్ ఎస్టేట్ మరింత ఊపందుకునే అవకాశం ఉంది. ఈ రోడ్డుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నిజానికి ఇది ప్రభుత్వ ప్రతిపాదన మాత్రమే. ఎక్కడ నివాసాలు ఉన్నాయి? ఎక్కడ చెరువు ఉంది? ఎక్కడ బఫర్ జోన్ ఉంది? ఎక్కడ విల్లాలు ఉన్నాయో? స్పష్టత రాలేదు. రోడ్లు భవనాల శాఖ తుది రిపోర్టు తర్వాతే రెవెన్యూశాఖ భూసేకరణ ప్రక్రియను చేపడుతుంది. అయితే ప్రభుత్వ ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణంలో కొంత మంది త్యాగం చేయక తప్పదు. రైతులు అనవసరంగా ఆందోళన చెందొద్దు.

భార్యాభర్తలు గొడవ పడొద్దన్నందుకు..

స్నేహితుడిపై కత్తితో దాడి

ఇబ్రహీంపట్నం రూరల్: భార్యాభర్తలు గొడవపడుతుండగా వద్దని వారించిన మిత్రుడు కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. ఆదిబట్ల ఠాణా పరిధి కుర్మల్‌గూడ ఆర్‌జీకేలో నివాసం ఉండే అహ్మద్ హుస్సేన్ ఈవెంట్ వర్కర్. రాత్రి పని ముగించుకుని ఒంటిగంట ప్రాంతంలో ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి సమీపంలో ఉన్న గ్రౌండ్‌లో అహ్మద్ హుస్సేన్ తమ్ముడు సోఫియా తన మిత్రులతో కలిసి ముచ్చటిస్తున్నాడు. పక్కబ్లాక్‌లో ఉండే అహ్మద్ స్నేహితుడు అజహర్ భార్యతో గొడవపడుతున్నాడు. వారి అరుపులు విన్న సోఫియా సర్దిచెప్పేందుకు వెళ్లగా నీకు ఎందుకు అంటూ అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేశాడు. దీంతో సోఫియా తిరిగి గ్రౌండ్‌కు వచ్చేశాడు. ఇంతటితో ఆగని అజహర్ ఇంట్లోని కత్తి జేబులో పెట్టుకుని వచ్చి సోఫియాతో గొడవకు దిగాడు. సోదరుడి గొడవను గమనించిన అహ్మద్ హుస్సేన్ అక్కడకు చేరుకుని వద్దని వారించడంతో అజహర్ వెంట తెచ్చుకున్న కత్తితో వీపు, నడుము క్రింది భాగంతో దాడి చేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన అహ్మద్ హుస్సేన్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విమోచనాన్ని అధికారికంగా నిర్వహిస్తాం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సయ్యగౌడ్


రక్తదాన శిబిరంలో నాయకులు, కార్యకర్తలు

తుర్కయంజాల్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తుర్కయంజాల్‌లో ఆ పార్టీ నాయకులు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు అధికారంలోకి రాక ముందు ప్రకటనలు చేసి, ఆ తరువాత చేతులు దులుపుకొంటున్నాయని ఆరోపించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 80 మంది రక్తదానం చేసినట్లు పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, శ్రావణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీఈ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: మద్యం మత్తులో చెరువులో దూకి పంచాయతీ రాజ్ రిటైర్డ్ డీఈ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నోయల్‌రాజ్ కథనం ప్రకారం.. సరూర్‌నగర్‌లో నివాసం ఉండే పాదూరి రమేశ్ డీఈగా పని చేసి రిటైరయ్యారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన అనారోగ్య సమస్యల బారినపడ్డారు. మన్నెగూడ ఆర్‌టీఓ కార్యాలయానికి వెళ్తున్నానంటూ గత మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. మన్నెగూడలోని సుచిరుచిలో మద్యం తాగి, తుర్కయంజాల్ మసాబ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రమైనా భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య రోహిణి సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుధవారం మసాబ్ చెరువులో తేలిన మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు రమేశ్‌గా గుర్తించారు. రోహిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోల దొంగ అరెస్ట్


స్వాధీనం చేసుకున్న ఆటోలతో మేడ్చల్ ఏసీపీ తదితరులు

మేడ్చల్ రూరల్: చెడు వ్యసనాలకు బానిసై..డబ్బుల కోసం ఆటోలను దొంగిలించి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం..లింగాపూర్ గ్రామానికి చెందిన కొరుపతి శ్రీరాములు అలియాస్ రాము కొంత కాలంగా దుండిగల్ పరిధిలోని చర్చి గాగిల్లాపూర్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసైన రాము తన జల్సాలు తీర్చుకునేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగా స్టీరింగ్ లాక్ (తాళం) లేని ఆటోలను దొంగిలించేందుకు ప్లాన్ వేసుకుని మేడ్చల్, దుండిగల్, గండి మైసమ్మ ప్రాంతాల్లో ఆటోలను దొంగలించారు. ఇటీవల మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఆటో దొంగిలించగా పోలీసులు దర్యాప్తు చేసి దొంగతనాలకు పాల్పడుతున్న రామును అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకోవడంతో అతని వద్ద నుండి మూడు ఆటోలు స్వాధీనం చేసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు.

లోన్ తీసుకుని లూటీ చేశారు!

- ఏపీకే ఫైల్ ద్వారా కథనడిపిన కేటుగాళ్లు
- మొత్తం రూ.13 లక్షలు స్వాహా చేసిన వైనం

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు నానాటికీ తెలివి మీరుతున్నారు. బాధితులు ఊహించని విధంగా పంజా విసురుతున్నారు. సెల్‌ఫోన్లలోని ఏపీకే ఫైల్స్ పంపి, వారి ఖాతాలకు ఖాళీ చేస్తున్న నేరాలు ఇటీవల కాలంలో వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అయితే బాధితుల నెట్ బ్యాంకింగ్‌ను వాడి, వారి ప్రమేయం లేకుండానే వారి పేరుతో రుణం తీసుకుని, ఖాతాలో పడిన తర్వాత, సేవింగ్స్‌తో కలిపి కాజేస్తున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. ఈ పంథాలో రూ.12.75 లక్షలు కోల్పోయిన సికింద్రాబాద్ వ్యక్తి ఈ నెల 2న సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించారు. తాజాగా రూ.13 లక్షలు కోల్పోయిన మరో బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మారేడ్‌పల్లి ప్రాంతానికి చెందిన బాధితుడి(45) ఫోన్‌కు సైబర్ నేరగాళ్లు ఇటీవల 'ఈ చలాన్ ఆర్టీఓ.ఏపీకే' పేరుతో ఉన్న లింకు పంపారు. దీనిపై అవగాహన లేని ఆ బాధితుడు అది ఈ–చలాన్లకు సంబంధించిన యాప్ అని భావించి క్లిక్ చేశారు. ఆ వెంటనే అందులో ఉన్న ఏపీకే ఫైల్ బాధితుడి ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయిపోయింది. ఇలా బాధితుడి ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్న సైబర్ నేరగాళ్లు ఆయనకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా నెట్ బ్యాంకింగ్‌ను యాక్సస్ చేశారు. 'పే యూ మనప్పుడు ఫిన్' పేరుతో ఉన్న వారి ఖాతాను బెనిఫిషియరీ అకౌంట్‌గా యాడ్ చేసుకున్నారు. లావాదేవీలకు సంబంధించిన ఓటీపీలు సైతం నేరగాళ్లు చూడగలగటంతో బాధితుడి నెట్ బ్యాంకింగ్ ద్వారానే రూ.12.5 లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మొత్తం మంజూరై బాధితుడి ఖాతాలో పడింది. దీంతో పాటు అప్పటికే ఖాతాలో ఉన్న సేవింగ్స్ రూ.50 వేలు కలిపి మొత్తం రూ.13 లక్షలు స్వాహా చేశారు. ఈ లావాదేవీలకు సంబంధించిన సందేశాలు వరుసపెట్టి అందుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించారు.

సాయుధ పోరు వారసులు కమ్యూనిస్టులే



సెమినార్‌లో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ పేర్కొన్నారు. బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వాస్తవాలు–వక్రీకరణ అనే అంశంపై ఇబ్రహీంపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజులు విచ్చేసి మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాయుధ పోరాటం సాగిందన్నారు. నిజాం ఆరాచకాలకు ఎదిరిస్తూ సామాన్యులు సాయుధులుగా మారారన్నారు. నిజాంను గద్దెదింపడం కోసం నాయకత్వం వహించింది కమ్యూనిస్టులేనన్నారు. సాయుధ పోరులో బీజేపీ, ఆర్ఎస్ఎస్ స్థానమెక్కడిదన్నారు. నిర్బంధాలు, త్యాగాలు చేసింది ఎందరో చెప్పగలరా అని ప్రశ్నించారు. వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటానికి ఏమాత్రం సంబంధం లేని పార్టీలు విమోచన, విలీనం, విద్రోహం అంటూ నేడు చరిత్రను వక్రభాష్యాలు చెబుతున్నారన్నారు. బీజేపీ అనేక ఏళ్ల నుంచి తెలంగాణలో మతపరమైన భావోద్వేగాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, డీవైఎఫ్ఐ కార్యదర్శి జగన్, నాయకులు సామేలు, గణేష్, శ్రీకాంత్, వంశీ, తరంగ్, జంగయ్య, అజయ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు ఆర్‌జీవీపై కేసు నమోదు

గచ్చిబౌలి: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ(ఆర్‌జీవీ)పై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆయన దర్శకత్వం వహించిన 'దహనం' వెబ్ సిరీస్ 2022లో ఏప్రిల్ 14న విడుదల చేశారు. ఇందులో ప్యూడలిస్టులు, నక్సలైట్లకు మధ్య జరిగే పోరాటాన్ని తెరకెక్కించారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి చెప్పిన వాస్తవ ఘటనల ఆధారంగా వెబ్ సిరీస్ రూపొందించినట్లు ఆర్‌జీవీ చెప్పారని, ఇది అవాస్తవమని రిటైర్డ్ ఐపీఎస్ అంజనా సిన్హా రెండు రోజుల క్రితం రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తాను ఎవరితోనూ వాస్తవ ఘటనలంటూ చెప్పలేదని ఆమె పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

శంకర్‌పల్లి: వ్యవసాయం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1967లో తమకిచ్చిన నాలుగు ఎకరాల భూమిని కొంతమంది కబ్జా చేస్తున్నారని మండలంలోని పొన్నగుట్టతండాకు చెందిన కిషన్, శంకర్, రాంసింగ్, ఆమ్రియాలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 1967లో ప్రభుత్వం తమ తండ్రి వాళ్యకి నాలుగు ఎకరాల భూమిని ఇచ్చింది. అప్పటి నుంచి దాన్ని ఏళ్లుగా సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. గత కొన్ని నెలల నుంచి మోకిల తండాకు చెందిన ఓ వ్యక్తి తమని భయభ్రాంతులకు గురి చేస్తూ, పొలం లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నాడు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ మంగళవారం పొలం వద్ద వారు పనులు చేస్తున్నారని సమాచారం అందింది. అక్కడికి మేము వెళ్లగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మోకిల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఇరువురు మాట్లాడుకోవాలని చెబుతున్నారే తప్పా.. కేసు నమోదు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా నా ఉన్నతాధికారులు స్పందించి, న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఓవర్ హెడ్‌ట్యాంక్ ఓవర్ ఫ్లో: వ్యక్తికి జరిమానా

సాక్షి, సిటీబ్యూరో: ఓవర్ హెడ్ ట్యాంకు ఓవర్ ఫ్లోలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బంజారాహిల్స్‌లో ఇంటి యజమానికి అధికారులు జరిమానా విధించారు. తట్టిఖాన పరిధి బంజారాహిల్స్‌లో ఒక ఇంటి నుంచి బోర్ వెల్ నీరు ట్యాంక్ నిండి నీరు ఓవర్ ఫ్లో అయి వీధిలోకి వచ్చింది. అక్కడే విధుల్లో ఉన్న మేనేజర్.. నీటి వృధా గమనించి ఇంటి యాజమానికి నోటీసు జారీ చేసి రూ.5000 జరిమానా విధించారు

మహిళలకు ఆరోగ్య రక్ష

- ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా 'స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్'
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


చేవెళ్ల: మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: నారీ శక్తితోనే దేశాభివృద్ధి సాధ్యమని ప్రధాని మోదీ మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్ ఆరోగ్య మహిళ–శక్తివంతమైన కుటుంబం (స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్) కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబానికి భరోసా ఉంటుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించారని.. పార్లమెంట్‌లోనూ మహిళల ప్రాతినిథ్యం ఉండాలని వారికి అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంత మహిళల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ప్రధాని జన్మదినం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి మహిళలకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అన్ని ఆస్పత్రుల ఆధ్వర్యంలో వైద్యసేవలను అందించారు. టీబీ రోగులకు ఆరోగ్య కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, జిల్లా అధికారి షఫీయుద్దీన్, ఉప వైద్యాధికారి నాగేంద్రబాబు, డివిజన్ వైద్యాధికారుల బృందం, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ మున్సిపల్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కేజీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో యువత పెద్ద ఎత్తున రక్త దానం చేసింది. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ వైభవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, శర్వలింగం, కృష్ణగౌడ్, మాణిక్యం రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, అశోక్, జైశంకర్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, సత్యనారాయణ, రుషికేష్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ధనుష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నాగరాజు, జైసింహ, కరుణాకర్, వెంకట్‌రెడ్డి, శివ, మధుకర్, కృష్ణారెడ్డి, రవి, కుమార్ తదితరులు ఉన్నారు.

హిమాయత్‌నగర్ కంజర్ల మాల్‌లో..

మొయినాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ కంజర్ల మాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ రత్నం, నాయకులు వెంకటేశ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

దేశ ప్రతిష్టను చాటిన వ్యక్తి మోదీ..

మహేశ్వరం: దేశ ప్రతిష్టను ప్రపంచ దేశాలకు చాటిన మహోన్నత వ్యక్తి ప్రధాని మోదీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. బుధవారం నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశ ప్రధాని పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన జన్మదినం సందర్భంగా 75 మంది యువకులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ రాష్ట్ర నాయకులు పాపయ్యగౌడ్, మండల అధ్యక్షుడు యాదీశ్, నాయకులు అనంతయ్యగౌడ్, మాధవాచారి, యాదయ్య గౌడ్, వెంకటేశ్ గౌడ్, సుదర్శన్ యాదవ్, శ్రవణ్, దేశ్యానాయక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మహేశ్వరం: రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్